క్లుప్తంగా

వేలాలలో గోదావరి మహా హారతి



హారతి ఇస్తున్న నిర్వాహకులు, భక్తులు

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల మల్లన్న స్వామి ఆలయంలో కార్తికమాసాన్ని పురస్కరించుకొని గోదావరి మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. గోదావరి మహా హారతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా, సమీప ప్రాంత భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

భీమిని: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు రాజలింగు అన్నారు. కన్నెపల్లి ఆయుష్ యోగా కేంద్రంలో శనివారం పలువురితో యోగాసనాలు వేపించారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు చొక్కయ్య, ఎస్. రజిత, ఆయుర్వేద వైద్యులు సంజయ్ కుమార్, విశ్వప్రసాద్, నీరజ, శ్రీదేవి, మాజీ సర్పంచ్ పుల్లూరి రాజయ్య, సంతోష్, రమేష్, వెంకటి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుపై అవగాహన



కార్మికులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

శ్రీరాంపూర్: త్వరలో జరగబోయే నాలుగు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో తెలంగాణ ప్రైవేట్ పాఠశాల సంఘం (ట్రస్మ) ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ 1గనిపై కార్మికులను కలిసి ఏ విధంగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలి, ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రేగళ్ల ఉపేందర్ తోపాటు ఉపాధ్యాయులు క్రాంతి, శ్రావణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

జైపూర్: మండల కేంద్రంలో గల భూనీల సమేతా వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి వైభవోపేతంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ ప్రధాన వ్యవస్థాపకులు బల్మూరి అరవీందర్‌రావు తెలిపారు. ఏటా నిర్వహించే స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరు రోజుల పాటు అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు, స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని జరిపించనున్నట్లు, అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

శారీరక ధృడత్వానికి క్రీడలు అవసరం

జన్నారం: క్రీడలు వినోదానికే కాకుండా శారీరక, మానసిక ధృడత్వానికి ఎంతో అవసరమని ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఫణిరాజా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్లేట్ ఎక్స్‌లెన్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన మండల స్థాయి బ్యాట్మింటన్ పోటీలను ప్రారంభించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో స్లేట్ హై స్కూల్ విద్యార్థులు రాజేశం, సందీప్ ప్రథమ స్థానాన్ని గెలుచుకోగా, కలమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు సృజన్, రామ్ చరణ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఎస్సై రాజవర్ధన్, ఎస్బీఐ మేనేజర్ మహేష్, స్లేట్ గ్రూప్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యాం లాల్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థికి విద్యుదాఘాతం



చికిత్స పొందుతున్న సంకీర్తన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ముల్కల్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి విద్యుత్ షాక్ గురైన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. హాస్టల్‌లో శనివారం రాత్రి విద్యార్థులందరూ కలిసి టీవీలో సినిమా వీక్షించారు. అనంతరం టీవీ ఆఫ్ చేసే క్రమంలో పదో తరగతి విద్యార్థి సంకీర్తన్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఉపాధ్యాయులు, సిబ్బంది మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

‘ప్రైవేట్’కే మొగ్గు..!



సారంగపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం

- ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ప్రారంభం కాని కొనుగోళ్లు
- మద్దతు ధర కోసం చూడకుండా దళారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- ఇప్పటివరకు సుమారు 500 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయం

మందమర్రిరూరల్: ఆరుగాలం కష్టపడి పంటను అమ్ముకోవడానికి రైతులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. మండలంలో సారంగపల్లి, పొన్నారం, బొక్కలగుట్ట గ్రామ పంచాయతీల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. క్వింటాల్ ధాన్యానికి రూ.2820 ప్రకటించింది. అయినా ఇంకా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో అన్నదాతలు నష్టానికైనా సరే ప్రైవేట్‌కు అమ్ముకోవడానికి మొగ్గుచూపుతున్నారు.

13,640మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి...

మందమర్రి మండలంలో 6200ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు. సుమారు 13వేల 640మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసినా, ఆ ధాన్యాన్ని రైతులు ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరకు ఎదురుచూడకుండా ప్రైవేట్ వారు అందించే రూ.2800 అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలంటే హమాలీ కూలీ డబ్బులతో పాటు సుతీల్‌ధారం, తప్పా..తాలు అని ఇలా అన్ని రకాలుగా వసూలు చేస్తుండడంతో ప్రైవేట్ వారికి అమ్ముకుంటున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రైవేట్ వారు ఇంటింటికీ వచ్చి కొనుగోలు చేయడం, ఎలాంటి వసూలు ఛార్జీలు లేకపోవడం, వెంటనే డబ్బులు ఇవ్వడంతో అమ్ముకుంటున్నట్లు చెబుతున్నారు. ఇప్పటివరకు సుమారు 500మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రైవేటుకు అమ్మినట్లు సమాచారం.

ధాన్యం కాపాడుకోవడానికి తంటాలు..!



భీమారం: ఆకాశం మేఘావృతం అయి ఉండడంతో రైతులు జంకుతున్నారు. వర్షం పడితే ధాన్యం తడుస్తుందని భయంభయంగా గడుపుతున్నారు. కాపాడుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో శనివారం మబ్బు రాగా అన్నదాతలు ధాన్యంపై కవర్లు కప్పుతుండగా ‘సాక్షి’ క్లిక్‌మనిపించింది.

వెంటనే నగదు ఇస్తున్నారు...



వరిధాన్యం ప్రైవేట్ వారికి అమ్ముకుంటే వెంటనే డబ్బులు చెల్లిస్తున్నారు. తప్పా, తాలు, సుతీలు, హమాలీ ఖర్చు, తేమ నిబంధన లాంటి వి లేకుండా ప్రైవేట్ వారు ఇంటికి వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వానికి అమ్ముకుంటే హమాలీ, సుతీలు ఖర్చులు, తేమ నిబంధన లాంటివి ఇబ్బందికరంగా ఉంటున్నాయి. డబ్బులు కూడా ఎప్పుడు పడుతాయో తెలియదు.

– కమలామనోహర్‌రావు, రైతు, సారంగపల్లి

ప్రభుత్వానికి అమ్ముకుంటే మద్దతు ధర



మండలంలో రైతుల సౌకర్యం కోసం సారంగపల్లి, పొన్నారం, బొక్కలగుట్ట గ్రామ పంచాయతీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. క్వింటాల్ వరి ధాన్యానికి మద్దతు ధర రూ.2820 చెల్లిస్తున్నాం. ప్రభుత్వానికి ధాన్యాన్ని అమ్ముకుంటే రైతు ఖాతాలో డబ్బులు పడుతాయి. ఎలాంటి మోసానికి తావుండదు. పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– కిరణ్మయి, మండల వ్యవసాయ అధికారి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

లక్సెట్టిపేట: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన ‘రైతు పండుగ’ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. అనతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల అభివృద్ధి కో సం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమస్యలున్నా అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేంచంద్, వైస్ చైర్మన్ ఎండీ ఆరీఫ్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, తహసీల్దార్ దిలిప్‌కుమార్, ఎంపీడీవో సరోజ, రైతులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్/కాసిపేట: కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లిలో, చెన్నూర్ మండలంలోని కిష్టంపేట రైతు వేదికల్లో శనివారం రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రైతుల పండగ కార్యక్రమాన్ని రైతులు, అధికారులు వీక్షించారు.

‘హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం’



నియామకపత్రం అందజేస్తున్న దీక్షితులు

నెన్నెల: అమలు కాని హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దీక్షితులు అన్నారు. మండల కేంద్రంలో శనివారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి సంస్థాగత విధి విధానాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బూత్ బలోపేతానికి కొత్త బూత్ అధ్యక్షులను నియమించినట్లు, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పతకాల విషయంలో రైతులకిచ్చిన మాట కూడా కాంగ్రెస్ తప్పిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు వంశీ, కేంద్ర ఇన్‌చార్జి సతీష్, పలు బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

‘బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలి’

బెల్లంపల్లిరూరల్: భారతీయ జనతా పార్టీ బెల్లంపల్లి సంస్థాగత ఎన్నికల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు, బెల్లంపల్లి పట్టణ సంస్థాగత ఎన్నికల సంయోజక్ బొలిశెట్టి అశ్విన్ రెడ్డి అన్నారు. పట్టణంలో బూత్ స్థాయి ఎన్నికల ప్రక్రియ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి బూత్ స్థాయిలో బీజేపీ సభ్యత్వాలు పూర్తి చేసి సంస్థాగత ఎన్నికలు నిర్వహించాలని స్థానిక నాయకులకు సూచించారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ అహర్నిశలు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కళ్యాణి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, నాయకులు శ్రీనివాస్, కమల, సుమలత, నవీన్, నర్సింగ్ , అరవింద్ రాము తదితరులు పాల్గొన్నారు.

అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న ఫారెస్టు రేంజర్ సదానందం

కోటపల్లి: అడవులతోనే మానవాళి మనుగడ సాధ్యమని, కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కోటపల్లి ఫారెస్టు రేంజర్ సదానందం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అడువులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి అడవుల ప్రాముఖ్యతను వివరించారు. వన్యప్రాణులను వేటడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అడవుల్లో మంటల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. అడవుల్లో జంతువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో సత్యనారాయణ, ఏవో సాయికృష్ణ, అటవీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం

జన్నారం/బెల్లంపల్లిరూరల్: రాష్ట్రంలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనల్లో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం అయింది. రాష్ట్రంలో అనేక చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఆహారం వికటించి అనేక మంది ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో కనీస వసతులు కల్పించి, నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో జన్నారంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం, బెల్లంపల్లిలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు దాగం శ్రీకాంత్, రెడ్డి చరణ్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వృత్తివిద్యపై విద్యార్థులకు అవగాహన

కోటపల్లి: స్థానిక మోడల్ స్కూల్ కళాశాల విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఆధ్వర్యంలో వృత్తివిద్య కోర్సులలో భాగంగా ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్‌పై ఒకేషనల్ ట్రైనర్లు సంజీవ్, ప్రేమ్‌సాగర్ అవగాహన కల్పించారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలి

కోటపల్లి: చలితీవ్రత పెరుగుతున్న దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి గురుకులాలు, కస్తూర్బా, సాంఘికసంక్షేమ వసతి గృహాల్లో ఉన్నటువంటి విద్యార్థిని, విద్యార్థులకు స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ చేయాలని ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. ప్రతీ హస్టల్‌లో కిటికీలు, వెంటిలేటర్లు లేక చలికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు యువరాజ్, దుర్గం సంతోశ్, నరేందర్, విశ్వనాథ్, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎంపిక

కాసిపేట: టీఎస్ యూటీఎఫ్ కాసిపేట మండల నూతన కమిటీని శనివారం జిల్లా కార్యదర్శి కిరణ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.రమేశ్, ప్రధానకార్యదర్శిగా బి.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పి.సోనెరావు, నవీన, కోశాధికారిగా బి.పద్మ, కార్యదర్శులుగా అన్నపూర్ణ, బాగ్యలక్ష్మి, కృష్ణ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సులోచన, సభ్యులుగా సునిల్, వోటి కన్వీనర్‌గా నరసింహ, ఎఫ్‌డబ్ల్యుఫ్ కన్వీనర్‌గా సునితలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రీడాకారులకు సన్మానం

నస్పూర్: సౌత్ జోనల్ స్థాయి యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన నస్పూర్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు సన్మానించారు. జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ విద్యార్థిని నబిల ఆనం, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థిని అలేఖ్యలు సౌత్ జోనల్ స్థాయి యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలకు ఎంపిక కాగా వారిని శనివారం సీసీసీలో జరిగిన ఓ కార్యక్రమంలో మంచిర్యాల బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బోయిన రాజ్‌కుమార్, అధ్యక్షుడు పాదం రవీందర్, చైర్మన్ మైసూర్, క్రీడాకారులు పాదం మహేందర్, జగత్ సాయి, సందీప్, అశోక్ పాల్గొన్నారు.

బీసీ సంఘం మండల అధ్యక్షులుగా మల్లేశ్

జైపూర్: మండల కేంద్రానికి చెందిన పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు వేముల మల్లేశ్‌కు అదనంగా బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా నియమించినట్లుగా బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్ తెలిపారు.

‘షాదీఖానా స్థలం కేటాయించడం హర్షనీయం’

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని షాదీఖానా స్థలం కబ్జాకు గురికాకుండా ముస్లిం మైనార్టీలకు తిరిగి కేటాయించి మరమ్మతు పనులు చేయించడం హర్షనీయమని, ఈ ఘనత ఎమ్మెల్యే వినోద్‌కు దక్కిందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు అన్నారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కృతజ్ఞతలు తెలిపారు.

చెక్కు అందజేత

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన ఉపాధిహామీ కూలీ బంగారు మల్లవ్వ కొద్దిరోజుల క్రితం ఉపాధి పనులకు వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. దీంతో ఆమెకు ప్రభుత్వం తరపున రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును, ఆమె భర్త నారాయణకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు శనివారం అందించారు.

అయ్యప్ప ఆలయంలో నిత్యాన్నదానం

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం పక్కన గల అయ్యప్పస్వామి ఆలయంలో మండల మకరజ్యోతి రోజులను పురస్కరించుకొని డిసెంబర్ 1 నుంచి జనవరి 15వ తేదీ వరకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

గణిత ఫోరం మండల కమిటీ ఎన్నిక

దండేపల్లి: తెలంగాణ గణితఫోరం దండేపల్లి మండల కమిటీని శనివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎన్.శ్రీనివాస్, మండల అధ్యక్షుడిగా రమేశ్, ఉపాధ్యక్షులుగా అనిత, చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజమౌళి, కోశాధికారిగా సీహెచ్.రమేశ్, కార్యదర్శిగా ఎన్. సంతోష్ ఎన్నికయ్యారు.

రోడ్డు బురదమయం..!



భీమారం: మండలంలోని బూర్గుపల్లి గిరిజన గూడెం సమీపంలో ప్రధాన రోడ్డు బురదమయం కావడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. గిరిజన కాలనీలో గల మంచినీటి బోరుబావుల నుంచి వచ్చే వృథా నీటిని తరలించేందుకు మురుగుకాలువలు లేకపోవడంతో ఆ నీరంతా రోడ్డు పాలవుతుందని స్థానికులు తెలిపారు. మట్టిరోడ్లు కావడంతో బురదమయంగా మారుతున్నాయని వాపోయారు. ఈ విషయంలో గ్రామపంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, ఇందులో భా గంగా సన్నవడ్లకు బోనస్‌గా రూ.500ప్రకటించినట్లు, రైతులకు ఒకే సారి రూ.2లక్షల రుణ మాఫీ చేసినట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని మహ్మదాబాద్, చింతగూడ, కిష్టాపూర్, రేండ్లగూడ, మురిమడుగు, కలమడుగు, పొనకల్ గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీవో శశికళ, కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, ఇసాక్, శంకరయ్య, నందునాయక్, లక్ష్మీనారాయణ, ఫసీఉల్లా, ముత్యం రాజన్న, రియాజోద్దీన్, మాణిక్యం, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివేక్ జన్మదిన వేడుకలు



భీమారం: పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రవి, మోహన్‌రెడ్డి, పున్నంచందు

భీమారం/రామకృష్ణాపూర్/కోటపల్లి/చెన్నూర్‌రూరల్/మందమర్రిరూరల్: చెన్నూర్ ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలను శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో కేక్ కట్ చేశారు. ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలుచోట్ల మొక్కలు నాటారు. దుప్పట్లు పంపిణీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో సీఐ



వేడుకల్లో పాల్గొని కేక్ తినిపిస్తున్న సీఐ

చెన్నూర్: చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకల్లో చెన్నూర్ సీఐ రవీందర్ పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. శనివారం వివేక్ జన్మదినం సందర్భంగా స్థానిక క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు వేడుకలు నిర్వహించారు. సీఐ రవీందర్ పాల్గొని పార్టీ నాయకులకు కేక్ తినిపించారు. పార్టీ నాయకులు నిర్వహించిన వేడుకల్లో ప్రభుత్వ అధికారి ఎలా హాజరవుతారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగ విరమణ కార్మికులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పలు గనులపై రిటైర్డ్ ఉద్యోగులను శనివారం యజమాన్యం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికింది. ఆర్కే 6 గనిపై రిటైర్డ్ అయిన ఉద్యోగులను మేనేజర్ తిరుపతి శాలువాతో సత్కరించి వారు చేసిన సేవలు కొనియాడారు. కంపెనీ నుంచి చెల్లించే టెర్మినల్ బెనిఫిట్స్ పే ఆర్డర్ కాపీని అందించారు. కార్యక్రమంలో గని రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, డిప్యూటీ మేనేజర్ కొముర‌య్య, పిట్ ఇంజినీ ర్ మహేష్, సంక్షేమ అధికారి సురేందర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ సంఘం సదానందం, నాయకులు గొర్రె నరసయ్య, కారుకూరి నగేష్, చిలక రామచందర్, అద్దు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓపెన్ కాస్ట్ గనిలో..

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను గని మేనేజర్ బ్రహ్మాజీరావు సత్కరించి వీడ్కోలు పలికారు.కార్యక్రమంలో గని రక్షణాధికారి శ్రీనివాస్, ఇంజినీర్ రాంచందర్, సీనియర్ పీవో శంకర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ జాయింట్ సెక్రెటరీ చంద్రమోహన్, పిట్ సెక్రెటరీ మోతే లచ్చన్న పాల్గొన్నారు. వీరితోపాటు ఎస్ఆర్పీ 1, ఎస్సార్పీ 3, 3ఏ, ఆర్కే న్యూటెక్ గనులపై కూడా రిటైర్డ్ ఉద్యోగులను కంపెనీ ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికింది.

మేనేజర్‌కు సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గని మేనేజర్ స్వామిరాజును ప్రమోషన్ పొందిన సందర్భంగా సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు.

ఒకే కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు



కొడుకు, కుమార్తెతో తల్లిదండ్రులు

చెన్నూర్: పట్టణానికి చెందిన నగునూరి శ్రీనివాస్-రమాదేవి దంపతులకు కుమారుడు విశాల్, కుమార్తె వినీత ఇద్దరు సంతానం. శ్రీనివాస్ సోన్నాయి వృత్తిపై ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. కుమారుడు విశాల్ కానిస్టేబుల్‌గా ట్రెనింగ్ పూర్తి చేసుకొని శనివారం రామగుండం కమిషనరేట్ పరిధిలో పోస్టింగ్ పొందాడు. కుమార్తె ఎక్సైజ్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. కొడుకు, కుమార్తెలకు ఉ ద్యోగం రావడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థికసాయం

జన్నారం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆటో డ్రైవర్ కామర దుర్గయ్య కుటుంబానికి శనివారం కవ్వాల్ ఆటో యూనియన్ నాయకులు రూ. 10వేల నగదు, 50కిలోల బియ్యం, వంట సామగ్రి అందజేసి ఉదారత చాటుకున్నారు.